

భద్రాచలం - వెంకటాపురం రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# వంతెన వెంటనే నిర్మించాలి

- ప్రధాన రహదారికీ మరమ్మతులు చేపట్టాలి
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రహదారి దిగ్బంధం

దుమ్ముగూడెం, మే 20: భద్రాచలం – వెంకటాపురం ప్రధాన రహదారిపై కుంగిపోయి ప్రమాదకరంగా మారిన తూరుబాక బ్రిడ్జిని నిర్మించాలని, అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేసూ బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు వందలాదిగా మంగళవారం తూరుబాక వద్ద రెండు గంటలపాటు రహదారి దిగ్బంధనం చేపట్టారు. అనంతరం ధర్నా నిర్వహించారు. దీంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణలు మాట్లాడుతూ ఈ మార్గంలో వెళ్లే స్థానిక ఎమ్మెల్యే, ఇటీవల ప్రయాణించిన జిల్లా మంత్రి కనీసం వంతెన, రోడ్ల గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. వర్షాకాలం వస్తూ వరద నీరు రోడ్డుపైకి చేరి ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ప్రమాదకరంగా ఉన్న రోడ్డుపై ఇప్పటికే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, సమస్యను పది రోజుల్లో పరిష్కరించకపోతే పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా.. ఆందోళన విషయం తెలుసుకున్న సీఐ అశోక్ అక్కడికి చేరుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ ఎండీ.జానీపాషా, డివిజన్ నాయకులు కోటగిరి ప్రబోద్‌కుమార్, భద్రాచలం మండల కన్వీనర్ ఆకోజు సునీల్‌కుమార్, కో-కన్వీనర్ రేపాక పూర్ణచందర్‌రావు, ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, సొసైటీ డైరెక్టర్ కలువ పూర్ణయ్య, బొల్లి వెంకట్రావు, సీనియర్ నాయకులు కొత్తూరు సీతారామారావు, వాగే వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు భూక్యా చందు, నగేశ్, కాటిబోయిన వెంకటేశ్వర్లు, కుంజా నాగేశ్వరరావు, రావులపల్లి పృథ్వీ, నోముల రామిరెడ్డి, కొత్తా మల్లేశ్వరరావు, లంకా శివ, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, బుధవారం 21 మే 2025 | BHADRADRI KOTHAGUDEM


### కేసీఆర్ పంపు నీళ్లే ఆసరా..



తాగునీటి కోసం ఎంతో గోసపడ్డాం. రాత్రనక, పగలనక చేతిపంపుల దగ్గర పడిగాపులు కాసినం. కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇంటింటికీ నీళ్లు వస్తున్నాయి. ఇప్పటికీ కేసీఆర్ పంపునీళ్లే మాకు దిక్కు. వాటిని తాగునీరు, ఇంట్లో అవసరాలకు వాడుకుంటున్నాం. మా ఊరిలో పెద్ద పంపుహౌస్ సైతం ఏర్పాటు చేశారు. అదే 'మిషన్ భగీరథ' నీళ్లు లేకపోతే ఈ వేసవిలో చాలా ఇబ్బంది పడేవాళ్లం.

–నారపాటి నాగేంద్రమ్మ, గృహిణి, ఏదులాపురం






జీళ్లచెరువులోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఫైల్)

### పాలేరు 'మిషన్ భగీరథ' వివరాలు..

- ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలు సహా సూర్యాపేట జిల్లాలోని 700 గ్రామాలకు మంచినీరు
- మూడు జిల్లాల్లో కలిపి 7 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు
- 30 మండలాలు.. 1,050 మంచినీటి ట్యాంకులకు సరఫరా
- రిజర్వాయర్ నుంచి రోజుకు 125 క్యూసెక్కుల నీరు కేటాయింపు
- పాలేరు ఇన్‌టేక్ వెల్ వద్ద 540 కిలో వాట్ల సామర్థ్యం గల 724 హెచ్‌పీ మోటర్లు
- జీళ్లచెరువులో డబ్ల్యూటీపీ వద్ద 180 కిలోవాట్ల సామర్థ్యం గల 240 హెచ్‌పీ మోటర్లు

**కనీసం తాగడానికి నీరు లేదు.. గుక్కెడు నీటి కోసం గంటలకొద్దీ నిరీక్షణ.. ఎండిపోయిన బోర్లు, బావులు, అద్దెబండ్లతో నీటి తోలకాలు, అర్ధరాత్రి సైతం మంచి నీటి కోసం నానాతంటాలు.. బిందెలు తీసుకొని కిలోమీటర్ల కొద్దీ వెళ్లి నీళ్లు తెచ్చుకోవడం.. చేతిపంపుల వద్ద బారులు తీరిన బిందెలు.. ఇవన్నీ ఉమ్మడి రాష్ట్ర పాలనలో ఎక్కడచూసినా కనిపించిన దృశ్యాలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ప్రజలకు తాగునీటి కష్టాలు శాశ్వతంగా దూరమయ్యాయి. ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందుతున్నది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించి 'మిషన్ భగీరథ' పేరుతో ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేసి శుద్ధిచేసిన జలాలను సరఫరా చేశారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలోని 700 గ్రామాల్లో మండు వేసవిలోనూ మంచినీరు అందుతుండడంతో 7,00,000 మంది ప్రజలు సంతోషంగా ఉన్నారు. తమ తాగునీటి కష్టాలు తీర్చిన మాజీ సీఎం కేసీఆర్‌ను అపర భగీరథుడిగా కొనియాడుతున్నారు. పాలేరు మిషన్ భగీరథపై 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం.**

**–కూసుమంచి, మే 20**

పల్లెలు, పట్టణాలు అనే తేడాలేకుండా వేసవి వచ్చిందంటే చాలు ప్రజలు తాగునీటికి చాలా ఇబ్బందిపడేవారు. ఫ్లోరైడ్ నీరు తాగి ఎంతోమంది రోగాల బారినపడిన ప్రజలూ ఉన్నారు. గతం తలుచుకుంటే ఎన్నో బాధలు, గాధలు.. వాటన్నింటికి కారణమైన తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది 'మిషన్ భగీరథ'. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ తీసుకున్న సాహసోపేత నిర్ణయం ప్రజల పాలిట వరంలా మారింది. ప్రతి ఇంటికీ నల్లా బిగించి శుద్ధిచేసిన తాగునీటిని అందిస్తుండడంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు. పాలేరు రిజర్వాయర్ నుంచి 300పైగా గ్రామాల్లో 1,050 మంచినీటి ట్యాంకులకు మంచినీరు సరఫరా చేస్తున్నారు. పాలేరు నియోజకవర్గంతోపాటు ఖమ్మం కార్పొరేషన్‌లోని 375 ఆవాస ప్రాంతాల్లో ఇంటింటికీ నల్లాలు బిగించారు. పాలేరు నుంచి జీళ్లచెరువు వరకు పైపులైన్ ద్వారా పంపించిన నీటిని అక్కడ శుద్ధిచేసి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, సూర్యాపేట జిల్లాల్లోని మొత్తం 700 గ్రామాలకు పైగా పాలేరు రిజర్వాయర్ నుంచి తాగునీటిని అందిస్తున్నారు. సుమారు 7లక్షల మందికి పాలేరు నుంచి తాగునీటిని అందిస్తున్నారు.

### మాదిరిపురం డబ్ల్యూటీపీ ద్వారా..

ఉమ్మడి వరంగల్ జిల్లాకు తాగునీరు అందిస్తున్న మాదిరిపురం డబ్ల్యూటీపీ(వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ద్వారా సుమారు 300 గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. పాలేరు నుంచి పైపులైన్ ద్వారా మాదిరిపురం వరకు నీటిని పంపి అక్కడ శుద్ధి చేసి గుట్టపైన ఏర్పాటు చేసిన ట్యాంక్ ద్వారా తిరుమలాయపాలెం, పాత వరంగల్ జిల్లాకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. మాదిరిపురం నుంచి తిరుమలాయపాలెం మండలంలోని అన్ని గ్రామాలకు సైతం తాగునీటిని అందిస్తున్నారు.




### జీళ్లచెరువు డబ్ల్యూటీపీ సక్సెస్..

జీళ్లచెరువు గ్రామంలో నిర్మించిన డబ్ల్యూటీపీ విజయవంతంగా పని చేస్తున్నది. నేలకొండపల్లి మండలంలో 75 మంచినీటి ట్యాంకులు, కూసుమంచిలో 79, ఖమ్మంరూరల్‌లో 76 ట్యాంకులకు పాలేరు మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. నేలకొండపల్లి భైరవునిపల్లి వరకు, తిరుమలాయపాలెం మండలం గూడూరుపాడు వరకు నీటిని పంపిస్తున్నారు. జీళ్లచెరువులో డబ్ల్యూటీపీ వద్ద 180 కిలోవాట్ల సామర్థ్యం గల 240 హెచ్‌పీ మోటర్లు ఏర్పాటు చేశారు.



ఇన్‌టేక్‌వెల్ వద్ద మానిటరింగ్ సిస్టం, 724 హెచ్‌పీ మోటర్లు

### సమస్య వస్తే తక్షణం స్పందిస్తున్నాం..



జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. ఎలాంటి ఇబ్బంది వచ్చినా వెంటనే సమస్యను పరిష్కరించి తాగునీటిని సరఫరా చేస్తున్నాం. గతంలో వేసవిలో పని చేయాలంటే చాలా ఇబ్బందులు పడ్డాం.. కానీ.. నేడు మిషన్ భగీరథతో తాగునీటి సమస్యలు తీరాయి. గ్రామీణ మంచినీటి వ్యవస్థ, పట్టణ మంచినీటి వ్యవస్థను చాలా పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఎక్కడా ఇబ్బంది లేకుండా శుద్ధి జలాలను సరఫరా చేస్తున్నాం.

–పుష్పలత, మిషన్ భగీరథ ఈఈ

### నిరంతర పర్యవేక్షణ..

ప్రతిరోజూ నీటిని శుద్ధి చేసి ల్యాబ్‌లో పరిశీలించిన తర్వాతనే ప్రజలకు సరఫరా చేస్తున్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా, నిరంతర పర్యవేక్షణకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. పాలేరు ఇన్‌టేక్ వెల్ నుంచి వరంగల్ జిల్లా, తిరుమలాయపాలెం మండలానికి తాగునీరు అందించడానికి ఒక్కొక్కటి 540 కిలోవాట్ల సామర్థ్యం గల ఆరు 724 హెచ్‌పీ మోటర్లు ఏర్పాటు చేశారు. అన్నీ విజయవంతంగా నీటిని పంపింగ్ చేస్తున్నాయి.



2017లో పాలేరు మిషన్ భగీరథ ప్రారంభ కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ (ఫైల్)

## సింగరేణి అభివృద్ధికి..
# బాసటగా నిలవాలి



అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ ఎన్.బలరాం

- ఉత్పాదకత పెంచాలి, ఉత్పత్తి వ్యయం తగ్గించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సంస్థ సీఎండీ ఎన్.బలరాం

కొత్తగూడెం సింగరేణి, మే 20: రానున్న మూడేళ్లలో అనుభవజ్ఞులైన సీనియర్ అధికారులు ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో యువ సింగరేణి అధికారులు సంస్థ అభివృద్ధికి బాసటగా నిలవాలని, వ్యాపార విస్తరణపై అవగాహన పెంచుకోవాలని సంస్థ సీఎండీ బలరాం సూచించారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న ద్వితీయ, తృతీయ శ్రేణి అధికారులైన మేనేజర్, డిప్యూటీ మేనేజర్‌లతో ఆయన మంగళవారం సాయంత్రం హెడ్డాఫీస్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అన్ని ఏరియాల నుంచి వివిధ విభాగాలకు చెందిన సుమారు 762 మందితో సమీక్ష నిర్వహించారు. సింగరేణి బొగ్గు ధర ప్రస్తుతానికి దేశంలోని ఇతర బొగ్గు కంపెనీల కన్నా చాలా ఎక్కువగా ఉన్నదని, అందుకే వినియోగదారులు తక్కువ ధరకు బొగ్గు లభించే మార్గాల వైపు మొగ్గు చూపుతున్నారని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. మన సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలని, ఉత్పత్తి వ్యయం తగ్గించాలని, ఇందుకు యువ అధికారులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాత గనులు కొన్ని మూతబడుతున్న నేపథ్యంలో ఒడిశాలోని నైనీ బ్లాక్, కొత్తగూడెంలోని వీకేవోసీ, ఇల్లెందులోని జీకేవోసీ, బెల్లంపల్లిలోని గోలేటి ఓసీల నుంచి ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో 20 మిలియన్ టన్నుల బొగ్గు అదనంగా వస్తుందని చెప్పారు. వీసీలో డైరెక్టర్లు సత్యనారాయణ, ఎల్వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, జీఎంలు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా ప్రాంగణం పనులు..
# త్వరగా పూర్తి చేయండి

**స్టేడియం నిర్మాణ పనుల పరిశీలనలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**



క్రీడా ప్రాంగణ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

దుమ్ముగూడెం, మే 20: ములకపాడు, ములకనపల్లిలో గిరిజన విద్యార్థుల కోసం నిర్మిస్తున్న క్రీడా ప్రాంగణం, కమ్యూనిటీ హాల్, ఇండోర్ స్టేడియం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో పర్యటించిన పీవో నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు క్రీడా ప్రాంగణంలో నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. పోలీస్ శిక్షణ తీసుకునే అభ్యర్థులకు తప్పనిసరిగా 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ అవసరం ఉంటుందని, ఇందుకోసం నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే కమ్యూనిటీ హాల్ త్వరితగతిన పూర్తి చేసి అన్ని సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, టీఏ శ్రీనివాస్, ఏఈ రవి తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు సేవ దైవారాధనతో సమానం

**పాలియేటివ్ కేర్ సెంటర్ తనిఖీలో డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి**



రోగులు, వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఖమ్మం సిటీ, మే 20: పాలియేటివ్ కేర్ సెంటర్‌లో ఉన్న రోగులకు సేవలు చేయడమంటే దైవారాధనతో సమానమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ కళావతి బాయి అన్నారు. మంగళవారం ఆమె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన వయో వృద్ధులు, క్యాన్సర్ బాధిత మహిళా పేషెంట్స్ వార్డులను (పాలియేటివ్ కేర్ సెంటర్)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానికంగా ఉన్న రోగులను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధాప్యంలోని పేషెంట్స్ ఇంటి దగ్గర ఉండటం వలన వారితోపాటు కుటుంబ సభ్యులకు సైతం మానసికంగా ఒత్తిడి ఉంటుందన్నారు. చివరి అవసాన దశలో ఉన్న వారికోసం పాలియేటివ్ కేర్ సెంటర్స్‌ను ఏర్పాటు చేయడం, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్స్‌తో సేవలు అందించడం గొప్ప మానవీయతకు నిదర్శనమని చెప్పారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ జీవిత కాలాన్ని పొడిగించుకుని ఆనందంగా గడపాలని రోగులకు సూచించారు. అదేవిధంగా వైద్యులు, ఇతర సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ఉత్తమ సేవలు అందించి రోగుల మన్ననలను పొందాలని కోరారు. అనంతరం డాక్టర్స్, నర్సింగ్ స్టాఫ్ హాజరు పట్టిక, ఇన్‌పేషెంట్స్ రిజిస్టర్స్, అందిస్తున్న సేవల వివరాలు రిజిస్టర్స్‌ను పరిశీలించి రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌లో వైద్యపరీక్షల గురించి డీఎంహెచ్‌వో అడిగి తెలుసుకున్నారు.

## పద్ధతి మార్చుకోకుంటే..
# బదిలీ వేటు తప్పదు

- వైద్య సిబ్బంది సమయ పాలనపై అసహనం
- ఇక్కడ ప్రసవాల సంఖ్య ఎందుకు తగ్గింది?
- బూర్గంపహాడ్ వైద్యులపై కలెక్టర్ జితేశ్ సీరియస్



బూర్గంపహాడ్ సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిపై సీరియస్ అవుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

బూర్గంపహాడ్, మే 20: విధి నిర్వహణలో పద్ధతి మార్చుకోకుంటే బదిలీ చేస్తాం అని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ హెచ్చరించారు. ఏజెన్సీలో ఉన్న బూర్గంపహాడ్ సీహెచ్‌సీ మ్యూజియంలా మారిందని, ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది ఎవరూ సమయపాలన పాటించరు అంటూ అసహనం వ్యక్తం చేశారు. డీసీహెచ్ఎస్ రవిబాబుతో కలిసి మంగళవారం బూర్గంపహాడ్ మండల పర్యటనకు వచ్చిన ఆయన కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల సంఖ్య పెరుగుతున్నా, ప్రసవాల సంఖ్య తగ్గిందని, ఆసుపత్రిలో సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది లేకపోతే రోగులు ఎలా వస్తారని మండిపడ్డారు. అశ్వారావుపేట, మణుగూరు, ఇల్లెందు ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఇక్కడ మీ పనితీరుతో గుండు సున్నాగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలాఖరు నాటికి కనీసం 20 ప్రసవాలైనా జరగాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రి పునర్నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లను ఎవరూ ఉపయోగించుకోవడం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు పున్నం చంద్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రి చుట్టూ ఉన్న ప్రహరీలో దారి వదిలి వాటిని ప్రజలు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ దృష్టికి తాగునీరు, టాయిలెట్ల సమస్యను గురుకుల అధికారులు తీసుకెళ్లారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో జమలారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు..
# వృత్యంతర శిక్షణ దోహదం

**ఫిజిక్స్, కెమిస్ట్రీ టీచర్ల శిక్షణ పరిశీలనలో భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరాచారి**



వృత్యంతర శిక్షణలో మాట్లాడుతున్న భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరచారి

పాల్వంచ/ చుంచుపల్లి, మే 20: విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని డీఈవో వెంకటేశ్వరాచారి పేర్కొన్నారు. అందుకోసమే వాటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని భౌతిక, రసాయన శాస్త్రాల ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు నిర్వహించనున్న జిల్లాస్థాయి వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని పాల్వంచ మండలం కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభించారు. మొదటి రోజు శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్జెక్టుల్లో మెళకువలు నేర్చుకొనేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సబ్జెక్టులను సరళమైన పద్ధతిలో విద్యార్థులకు బోధించేందుకు ఉపాధ్యాయులు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. కోర్సు కో ఆర్డినేటర్ సైదులు, డీఆర్‌పీలు సంపత్, ప్రభుసింగ్, ఆపక శంకర్, మోహన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**చుంచుపల్లిలో..**

చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ తరగతులు చుంచుపల్లి మండలం రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎంఈవో బాలాజీ ఈ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఐదురోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం, ప్రాథమిక తరగతుల విషయాల్లో డిజిటల్ టూల్స్ ద్వారా బోధన, ప్రస్తుత తెలంగాణ ప్రాథమిక విద్యలో ఎదురవుతున్న సమస్యలు మొదలైన అంశాలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. మండలాల ఎంఆర్‌పీలు పాల్గొన్నారు.

# రైతులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించం

- నిబంధనల ప్రకారమే విత్తనాలను విక్రయించాలి
- విత్తనాల బ్యాగుపై చివరి గడువు తేదీ ముద్రించాలి
- ఆకస్మిక తనిఖీల్లో రికార్డుల్లో తేడా ఉంటే చర్యలు
- రిటైలర్ల సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రఘునాథపాలెం/ మామిళ్లగూడెం, మే 20: జిల్లాలో రైతులకు నిబంధనలను పాటిస్తూ విత్తనాలను విక్రయించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విత్తనాల విక్రయం, ఈ పాస్ యంత్రాల వినియోగంపై రిటైలర్లతో నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. రాబోయే సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులు పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వానకాలం సాగుకు అవసరమయ్యే విత్తనాలు ఏ ప్రాంతంలో ఎంత డిమాండ్ ఉంటుందో అంచనా వేసి దానికి అనుగుణంగా అక్కడ విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. జిల్లాలో రైతులంతా ఒకేసారి నాట్లు వేయకుండా, ప్రణాళిక ప్రకారం నాట్లు జరిగేలా చూడాలని, ప్రతి మండలం పరిధిలో ఎప్పుడు నాట్ల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ తయారు చేసుకోవాలని, వరియేతర పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. విత్తనాల బ్యాగ్‌పై లేబుల్, నిల్వ చివరి గడువు తేదీ మొదలగు వివరాలను స్పష్టంగా తెలియజేసి అమ్మాలన్నారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేసిన సమయంలో రికార్డులు అప్‌డేట్ కాకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంవీ మధుసూదన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వాసవీరాణి, వెంకటేశ్వరరావు, విజయచంద్ర, సరిత, మండల వ్యవసాయ అధికారులు, రిటైలర్లు తదితరులు పాల్గొన్నారు.



విత్తన కంపెనీల రిటైలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్